సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 7 । జూన్ । 2024



చెస్‌లో సత్తాచాటుతున్న ఫ్యామిలీ

ఏలూరుకు చెందిన గంజి యోహానన్ కుటుంబంలో అరుదుగా తల్లిదండ్రులతో పాటు కుమారులిద్దరూ చదరంగం క్రీడలో సత్తా చాటుతున్నారు. 8లో ▸



పడవెక్కితేనే గమ్యం చేరేది

తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు కష్టాల కడలిలో బతుకుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పడవలపై ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. 8లో ▸



లారీ ఢీకొని సైక్లిస్ట్ మృతి

తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ప్రమాదంలో దువ్వ గ్రామానికి చెందిన సైక్లిస్ట్ మృతిచెందాడు. 8లో ▸

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఈ వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని ఐద్వా భవన్ నందు ప్రపంచ పర్యావరణ పరిక్షణ దినోత్సవం సందర్భంగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బాల వికాస్ భారత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జాతి సుఖంగా బతకాలంటే ప్రకృతి సమతుల్యత పాటించాలని, ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యుడు వీజీఎం కృష్ణారావు మాట్లాడుతూ కరోనా లాంటి విపత్తుల కాలంలో ఆక్సిజన్ కొరత వచ్చిందని, చెట్లు నరకడం లాంటి మానవ తప్పిదాల వల్ల ఆక్సిజన్ కొరత ఏర్పడిందన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక వనాలను పెంచాలని కోరారు. సభాధ్యక్షుడు కట్టా సత్యనారాయణ మా ట్లాడుతూ ధరిత్రి అంటే మనుషులే కాదని జంతువులు, పక్షులు, మొక్కలు, జీవ, నిర్జీవ పదార్థాల స మాహారమన్నారు. వీటిని రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.కస్తూరిరావు, పోలవరపు దేవరత్నాకర్, ఎం.అజయ్‌బాబు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, ఏలూరు స్మార్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. సదస్సు ముందు ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్‌రోడ్డు, వాసుదేవాలయం ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు.

జిల్లాలో 685 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లాలో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం 685.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా 20 మండలాల్లో 34.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు సమాచారశాఖ తెలిపింది. అత్యధికంగా నరసాపురం మండలంలో 80.6 మిల్లీమీటర్లు, మొగల్తూరు మండలంలో 63.2, పాలకొల్లులో 46.8, గణపవరంలో 51.2, పెనుమంట్రలో 31.2, పెనుగొండలో 16.2, ఆచంటలో 11.2, పోడూరులో 10.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. యలమంచిలిలో 12.2, ఆకివీడులో 11, ఉండిలో 19.4, పాలకోడేరులో 18.8, వీరవాసరంలో 40.2, భీమవరంలో 45.2, కాళ్లలో30.2, తాడేపల్లిగూడెంలో 29.2, పెంటపాడులో 33,2, తణుకులో 46.6, అత్తిలిలో 58.8, ఇగరవరంలో 29.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎన్నికల కోడ్ నిలుపుదల

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్) అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన కోడ్ జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తదుపరి 48 గంటల వరకు అమల్లో ఉందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడం, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో కోడ్ అమలును నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును గురువారం సాయంత్రం నుంచి నిలుపుదల చేశామన్నారు.

చట్టబద్ధమైన దత్తతతో హక్కులు

ఏలూరు(మెట్రో): చట్టబద్ధమైన దత్తత తీసుకోవటం ద్వారానే సహజంగా పుట్టిన బిడ్డలకు సంక్రమించే అన్ని చట్టబద్ధమైన హక్కులు వర్తిస్తాయని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో 11 నెలలు, 4 నెలల చిన్నారులను కర్ణాటక, తమిళనాడుకు చెందిన వారికి గురువారం దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కారింగ్స్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాధాన్యత క్రమంలో తమ వంతు వచ్చినప్పుడు కోరిన పిల్లలను దత్తత తీసుకోవచ్చని, ఏ ఒక్కరూ కూడా అక్రమ మార్గంలో దత్తత కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కర్ణాటకకి చెందిన వారు తమ పాప పేరును ప్రవల్లిక నుంచి ప్రన్విగా మార్చుకున్నారు. తమిళనాడుకు చెందిన వారు 4 నెలల పాపకు తలిర్ ఆదిరగా పేరు మార్చుకున్నారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా కృషి చేయాలని కోరారు.

ఆక్వాకు వరుణుడి దెబ్బ

- ఉష్ణోగ్రతల్లో మార్పులు
- ఆక్వా చెరువులకు ఆక్సిజన్ సమస్య
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో సాగు

కైకలూరు: నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనాల కారణంగా వాతావరణ మార్పుతో వర్షాలు కురుస్తున్నాయి. నిన్నటివరకు మండు వేసవిని తలపించేలా ప్రతాపం చూపిన భానుడికి నీలిమేఘాలు అడ్డుపడ్డాయి. వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. అప్పటివరకు నమోదైన 39 డిగ్రీల ఉష్ణోగ్రతలలో మార్పు వస్తోంది. దీంతో ఈ ఏడాది ఆక్వా రైతులకు ఆక్సిజన్ సమస్య భయపెడుతోంది. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొద్దిరోజులుగా చేపల చెరువుల్లో మార్పు కనిపిస్తోంది. వాతావరణంలో మార్పుతో ఆక్సిజన్ సమస్య తలెత్తితే రూ.కోట్లలో నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఆక్సిజన్ సమస్య తలెత్తి మరణించిన చేపలు (ఫైల్)



చేపల పట్టుబడులు (ఫైల్)

వేధిస్తున్న వ్యాధులు

చేపల, రొయ్యల చెరువులను వ్యాధులు వేధిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చేపల, రొయ్యల సాగు ఉంది. రైతులు పట్టుబడులకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో వాతావరణం రైతులను భయపెడుతోంది. ఇప్పటికే చెరువులను పేను, తాటాకు తెగులు, శంకుజలగ, రెడ్ డిసీజ్ వంటి వ్యాధులు పట్టిపీడిస్తోన్నాయి. ముఖ్యంగా రొయ్యల రైతులలో వైట్ వైరస్ రైతులను మరింత వేధిస్తోంది. వీటికి తోడు వాతావరణ మార్పులతో ఆక్సిజన్ సమస్య తలెత్తితే పూర్తిగా ఆక్వా రైతులు నష్టపోతారు.

ఏటా రూ.90 కోట్ల నష్టం

దేశంలోనే ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తోంది. ఇందులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా ఎగుమతుల్లో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఇప్పటివరకు ఎండలు మండిపోయి ఒక్కసారిగా వర్షం కురుస్తుండటంతో చెరువుల అడుగుభాగాన ఉన్న విష రసాయనాలు ఒక్కసారిగా పైకి వచ్చి ఆక్సిజన్ అందక చేపలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఇదే ప్రమాదంతో ఏటా జిల్లాలో రూ.90 కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఆక్సిజన్ సమస్య లక్షణాలు, నివారణ చర్యలను కైకలూరు మత్స్యశాఖ ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్ వివరించారు.

ఆక్సిజన్ సమస్య లక్షణాలు

- చెరువుల్లో రొహు, కట్లా పెద్ద సైజు చేపలు అధికంగా మరణిస్తాయి.
- ప్రధానంగా మొప్ప వ్యాధి సోకిన చేపలు మరణం ఎక్కువగా ఉంటుంది.
- ఉదయం చేపలు ఉపరితలంపైకి వచ్చి గాలి పీల్చుకుంటాయి.
- చెరువులో ప్లాంక్టిన్ గోధుమ రంగులో కనిపిస్తుంది.
- నీరు పచ్చబారిన సూపు రంగులోకి మారి పులిసిన వాసన వస్తుంది.
- అడుగుభాగంలో నత్తలు పైకి తేలుతాయి.

నివారణ పద్ధతులు

- ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమైనప్పుడు మేతలు కట్టకూడదు.
- కాల్షియం హైడ్రాక్సన్ ఎకరానికి 2 కేజీలు చల్లాలి.
- లైమ్ (సున్నం) ఎకరానికి 25 కేజీలు పిచికారీ చేయాలి.
- ప్లాంక్టిన్ ఉంటే సూపర్ ఫాస్పేట్ ఎకరానికి 25 కేజీలు చల్లాలి
- నీటిలో అమ్మోనియా ఉంటే యుక్క పౌడర్ ఎకరానికి అరకేజీ చల్లాలి.
- చెరువులో చనిపోయిన చేపలను తొలగించాలి.
- ఆక్సిజన్ సమస్య నుంచి కోలుకున్న తర్వాత టన్ను మేతకు 10–15 కేజీల మినరల్ మిక్చర్ కలిపి చల్లాలి. చెరువులో ఏరియేటర్లు ఎక్కువగా తిప్పాలి.

వైఎస్సార్‌సీపీ కేడర్ కోసం ప్రత్యేక కమిటీ

టీడీపీ దాడుల నుంచి అండ

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కేడర్ కోసం ప్రత్యేక కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలిచ్చింది. 11 మంది సభ్యులతో ఏర్పాటైన ఈ కమిటీ పార్టీ శ్రేణులకు అండగా ఉంటుంది. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన కార్యకర్తల దాడులతో రాష్ట్రంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే పలుచోట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారని పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది. ఈ సమయంలో పార్టీ కేడర్‌కు తోడుగా నిలిచేందుకు 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు కమిటీలను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీలో నిలిచిన అభ్యర్థులు, ఎమ్మెల్సీలతో కమిటీని ఏర్పాటుచేసింది. పార్లమెంట్ పరిధిలోని కార్యకర్తలు, అక్కచెల్లెమ్మలు, సోషల్ మీడియా సైనికులకు ఈ కమిటీ తోడుగా ఉంటుంది. బాధిత కుటుంబాలను పరామర్శించడం, న్యాయపరంగా, వైద్యపరంగా, ఆర్థికంగా సహాయంగా నిలుస్తామని కేంద్ర కార్యాలయం తెలిపింది.

కమిటీ సభ్యులు వీరే.. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన గూడూరి ఉమాబాల, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, మాజీ మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ మాజీ విప్ గ్రంధి శ్రీనివాస్, ఉండి, పాలకొల్లు ఇన్‌చార్జులు పీవీఎల్ నరసింహరాజు, గుడాల శ్రీహరిగోపాలరావులు ఉన్నారు.

సంక్షేమం అందించినా ..

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసిన ఇతర రాష్ట్రాలు కూడా ఎంతో ఆసక్తి కనబర్చినా ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఎందుకు తక్కువ ఓట్లు వచ్చాయో అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. గురువారం తణుకు సజ్జాపురంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అయితే కొన్ని వర్గాలు పార్టీకి దూరమయ్యారని, వారి విశ్వాసాన్ని పొందలేకపోయామన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చేసిన దుష్ప్రచారం ఎక్కువ పనిచేసిందన్నారు. ప్రజల తీర్పును శిరసా వహించి ప్రజాసేవలో మరింత చురుగ్గా పని చేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమయమనం పాటించి శాంతిభద్రతలను కాపాడాలని అధికార ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను కోరారు. రాబోయే కాలంలో పార్టీ అంతర్గత పునర్నిర్మాణానికి పటిష్ట పునాదుల ఏర్పాటు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించి ప్రజలకు మేలు చేసేలా పరిపాలన చేయాలని కోరారు. అలాగే దేశ రాజకీయాల్లో తెలుగు ఎంపీల పాత్ర ఎక్కువగా ఉందని, దీంతో రాష్ట్రానికి కావాల్సిన అన్ని పనులు వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. తణుకు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరిమిల్లి రాధాకృష్ణ, నరసాపురం ఎంపీగా ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాసవర్మలకు అభినందనలు తెలుపుతూ నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, ఇందుగపల్లి బలరామకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఉపాధ్యక్షులు సుద్దుల పాండు, గుబ్బల సూర్యచంద్రరావు, నాయకులు డీజే అమూల్యరావు, బడేటి నాగేశ్వరరావు, యరబాటి రామకృష్ణ, కొత్తపల్లి చరణ్, బీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్’ సప్లిమెంటరీ పరీక్షలకు 851 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) ఆధ్వర్యంలో దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలకు గురువారం 851 మంది హాజరయ్యారు. టెన్త్ గణితం పరీక్షకు 532 మందికి 436 మంది, ఇంటర్మీడియెట్ గణితం పరీక్షకు 307 మందికి 271 మంది, చరిత్ర పరీక్షకు 160 మందికి 144 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

బడి తెరిచిన రోజే పుస్తకాలు

- పంపిణీకి సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో 1,379 ప్రభుత్వ పాఠశాలలు
- 99,034 మంది విద్యార్థులు
- 7.98 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
- పాఠశాలలకు చేరుకుంటున్న విద్యాసామగ్రి



భీమవరానికి చేరిన పాఠ్యపుస్తకాల స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భీమవరం: బడులు తెరిచి రోజులు గడుస్తున్నా విద్యార్థులకు పుస్తకాలందక విద్యార్థులు లబోదిబోమంటున్నా పట్టించుకోని రోజుల నుంచి.. బడులు తెరిచిన రోజునే పిల్లల చేతుల్లో పుస్తకాలు పెట్టేలా గత ప్రభుత్వం చేపట్టిన చర్యలు అక్కరకొచ్చాయి. గత ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు బడి తెరిచిన వెంటనే పుస్తకాలు, విద్యాసామగ్రి అందించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా ఈనెల 12నే విద్యా సామగ్రి అందించడానికి విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 1,379 ప్రభుత్వ స్కూళ్లలో సుమారు 99,034 మంది విద్యార్థులకు పుస్తకాలతోపాటు విద్యా సామగ్రి పంపిణీకి సిద్ధం చేశారు. ఇప్పటికే పలు పాఠశాలలకు విద్యా సామగ్రి చేరగా మిగిలిన పాఠశాలలకు త్వరితగతిని అందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 7,98,266 పాఠ్య పుస్తకాలు అవసరమవుతాయని గుర్తించి దానికి అనుగుణంగా జిల్లాలోని గణపవరం మండలం మినహా మిగిలిన 19 మండల కేంద్రాలకు పుస్తకాలను నేరుగా ప్రింటర్స్ సరఫరా చేస్తున్నారు. పేద విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారనే ప్రగాఢ విశ్వాసంతో వైఎస్ జగన్ మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థుల అవసరం మేరకు నూతన భవనాలు నిర్మాణంతోపాటు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, బెంచీలు, టేబుళ్లు వంటివన్నీ సమకూర్చారు. వీటితో పాటు విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలతోపాటు స్కూల్ యూనిఫాం, బ్యాగ్, టై, షూస్, బెల్ట్, డిక్షనరీ వంటివి ఉచితంగా అందించే ఏర్పాట్లు చేశారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠ్య పుస్తకాలతోపాటు 6,71,086 నోట్ పుస్తకాలు, 99,034 మందికి యూనిఫామ్, 99,187 షూస్, 99.034 బ్యాగ్స్, 66,379 బెల్ట్స్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. బెల్ట్స్‌ను బాలికలకు 5వ తరగతి నుంచి, బాలురకు 1వ తరగతి నుంచి అందిస్తారు. అలాగే డిక్షనరీలు, 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

జిల్లాలోని 19 మండలాల్లో..



‘జిల్లాలోని 19 మండలాల్లోని విద్యార్థులకు ఈనెల 12న విద్యా సామగ్రి అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. సుమారు 7.98 లక్షల పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటికే దాదాపు పుస్తకాలు చేరాయి. అలాగే షూస్, బ్యాగ్స్, బెల్ట్స్, యూనిఫామ్ వంటివన్నీ పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులందరికీ అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

– పి.శ్యామ్‌కుమార్, సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ జిల్లా కో–ఆర్డినేటర్, భీమవరం

20న ఆక్వా రైతుల సమావేశం



విలేకరులతో మాట్లాడుతున్న ఆక్వా రైతు సంఘం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఆక్వా రైతుల సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, తమ సమస్యల పరిష్కారానికి ఆక్వా రైతులంతా సంఘటితం కావాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. గురువారం పాలకొల్లు పూలపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న ఆక్వా రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20న ఆక్వా రైతుల సమస్యలపై రాష్ట్రస్థాయిలో 10 వేల మంది ఆక్వా రైతులతో పాలకొల్లులో సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫీడ్ ధరలను పెంచుతూ ఫ్యాక్టరీలు, రొయ్యల ధరలను తగ్గిస్తూ ప్రాసెసింగ్ యూనిట్లు రైతులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో అప్పడా ఆధ్వర్యంలో కాకినాడలో ఫీడ్, ప్రాసెసింగ్ యూనిట్లతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు నష్టం లేకుండా చర్చలు జరిపారని చెప్పారు. అయినా ఫీడ్ ఫ్యాక్టరీలు, ప్రాసెసింగ్ సంస్థల్లో ఎలాంటి మార్పులు రాలేదన్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న ఫ్యాక్టరీల నుంచి ఫీడ్ కొనుగోలు చేయకుండా అలాగే ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్లకు రొయ్యలు విక్రయించకుండా ఆక్వా రైతులంతా సంఘటితం కావాలన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ యూనిట్ ధర రూ.1.50కే అందించారని, అయితే అది కూడా 60 శాతం మందికి మాత్రమే అందిందన్నారు. ఈ సబ్సిడీని పూర్తిస్థాయి ఆక్వా రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈనెల 12న జిల్లాలో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులను కలిసి ఆక్వా రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోణం చినబాబు, ఆర్.సత్యనారాయణరాజు, జాన్‌రాజు, కోడి విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టెనోగ్రాఫర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): కృష్ణా జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్లను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు కృష్ణా జిల్లా జడ్జి గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. మూడు పోస్టులు ఉన్నాయని జీతం నెలకు రూ.18,500 చెల్లిస్తారన్నారు. అభ్యర్థులు డిగ్రీ, టైప్‌రైటింగ్, షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్‌గ్రేడ్‌తో కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. 2024 జూలై1 నాటికి 18–42 ఏళ్లలోపు వయ సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, విభిన్న ప్రతిభావంతులు, మాజీ సైనికోద్యోగులకు 10 ఏళ్ల సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను వచ్చేనెల 15న సాయంత్రం 5 గంటలలోపు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, కృష్ణా జిల్లా మచిలీపట్నం చిరునామాకు పంపాలని కోరారు. ముందుగా స్కిల్ టెస్టు నిర్వహిస్తామన్నారు. వివరాలను వెబ్‌సైట్‌లో, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కలెక్టరేట్‌లు, ఉపాధి కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచామని పేర్కొన్నారు.

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–2023కు సంబంధించిన అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈనెలలో జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్న కేంద్ర బృందానికి సమగ్ర సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో శ్రేష్టత కోసం ప్రధానమంత్రి అవార్డులు–2023 ఎంపికలో భాగంగా జిల్లాలో పర్యటించనున్న కేంద్ర బృందం పర్యటనపై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్ర ప్ర భుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరును అధికారుల నుంచి, సంబంధిత వ్యక్తిగత లబ్ధిదారుల ద్వారా సమాచారం సేకరిస్తున్నామన్నారు. జిల్లాలో సంబంధిత పథకాలకు సంబంధించి సమగ్ర వివరాలను, విజయగాథలను, ఫొటోలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన, హర్ గర్ జల్ యోజన, మిషన్ ఇంద్రధనుష్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్యయోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, పీఎం స్వానిధి, ప్రధానమంత్రి మాతృవందన యోజన, పీఎం విశ్వకర్మయోజన, పీఎం ముద్రయోజన, ప్రధానమంత్రి పోషణయోజన తదితర పథకాల ద్వారా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలను, ఉత్తమ అభ్యాసాలను కేంద్ర బృందం పరిశీలించిందన్నారు. ఈ సమయంలో వారికి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్ర బృందం పర్యటన సమయంలో సంబంధిత శాఖల అధికారులు వారితో కలిసి వెళ్లాలన్నారు. హౌసింగ్ పీడీ కె.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివునికి ప్రత్యేక అభిషేకాలు



శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకస్వామి

పాలకొల్లు అర్బన్: ప్రముఖ వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామికి వైశాఖ అమావాస్య శని జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీ పార్వతీ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో నామాల రంగరాజన్, అర్చక స్వామి ర్యాలి శివాజీ భక్తులకు సేవలందించారు.

ఎస్ఈబీ సీఐ శ్రీనివాస్‌కు రాష్ట్ర అవార్డు



ఎస్ఈబీ కమిషనర్ రవిప్రకాష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఐ మద్దాల శ్రీనివాస్

తణుకు: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ మద్దాల శ్రీనివాస్ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంగళగిరి ఎస్ఈబీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఈబీ కమిషనర్ రవిప్రకాష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, ట్రోఫీ, నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

పాఠశాలలో 2 టీవీలు మాయం

జంగారెడ్డిగూడెం: తాడువాయి ఎంపీపీ స్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు టీవీలను చోరీ చేసినట్లు స్కూల్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎ.మధుసూదనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 3వ తేదీన పాఠశాలను శుభ్రం చేసేందుకు ఆయా వెళ్లగా పాఠశాలకు వేసిన తాళాలు కోసి ఉండటాన్ని గుర్తించిందన్నారు. సమాచారం తెలుసుకున్న హెచ్ఎం పాఠశాలకు వెళ్లగా, అక్కడ 3వ తరగతి, 5వ తరగతి గదిలో ఉండాల్సిన రెండు టీవీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై చుట్టు పక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం ఫిర్యాదు చేశారన్నారు.

చెస్‌లో సత్తా చాటుతున్న ఫ్యామిలీ

- చెస్ క్రీడలో రాణిస్తున్న కుటుంబం
- 19 ఏళ్ల నుంచి కోచ్‌గా తండ్రి, చెస్ అకాడమీ ఏర్పాటుతో పాటు పోటీల నిర్వహణ
- రాష్ట్ర స్థాయిలో 3 సార్లు విజేతగా తల్లి
- పతకాల పంట పండిస్తున్న కుమారులు

ఏ కుటుంబంలోనైనా ఎవరో ఒకరు ఏదోక క్రీడలో పేరుతెచ్చుకోవడం సాధారణం. కొన్ని కుటుంబాల్లో తండ్రి నుంచి వారసత్వంగా ఏదోక క్రీడలోనూ ప్రతిభ చూపుతుండటం చూస్తుంటాం. అయితే ఏలూరుకు చెందిన గంజి యోహానస్ కుటుంబంలో అరుదుగా తల్లిదండ్రులతో పాటు కుమారులిద్దరూ చెస్ క్రీడలో సత్తా చాటుతున్నారు. తండ్రి గంజి యోహానస్, తల్లి హదిస్సా అరుణతో పాటు కుమారులు అనురూప్ మోషే, అభిషేక్ అబ్రహమ్ చెస్ క్రీడాకారులుగా రాణిస్తున్నారు. కలిసి సాధన చేస్తున్నారు. ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. పోటీ పడి పతకాలు సొంతం చేసుకుంటూ పలువురి మన్ననలు పొందుతున్నారు.



భార్య హదిస్సా, కుమారులు అబ్రహమ్, అనురూప్‌లతో గంజి యోహానస్



భీమవరం పోటీల్లో బహుమతి అందుకుంటున్న అబ్రామ్, అనురూప్ మోషే (ఫైల్)

ఏలూరు రూరల్: గంజి యోహానస్ అంతర్జాతీయ ఫిడే చెస్ రేటెడ్ ప్లేయర్. స్టాండర్డ్ విభాగంతో పాటు రాపిడ్ చెస్ విభాగంలో 1,521 ర్యాంక్ సాధించారు. బ్లిట్స్ విభాగంలో 1,520 ర్యాంక్ చేరుకున్నారు. ఈయన దగ్గర శిక్షణ పొందిన 11 మంది జాతీయ, రాష్ట్ర, జిల్లా చాంపియన్‌షిప్ సాధించి అంతర్జాతీయ రేటెడ్ ప్లేయర్స్‌గా గుర్తింపు పొందారు. గత 19 ఏళ్లుగా కోచ్‌గా రాణిస్తూ, 6 సార్లు రాష్ట్ర ఉత్తమ శిక్షకుడిగా అవార్డులు అందుకున్నారు. క్రీడాకారుడిగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో 25 బహుమతులు అందుకున్నారు. అంతేకాక గారీ, కాస్పారొవ్ చెస్ అకాడమీ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో చదరంగంపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తుండటం విశేషం.

జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్ కోసం..

తల్లి హదిస్సా అరుణ నేటికీ చెస్ క్రీడాకారిణిగా రాణిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి మహిళ విభాగం చెస్ పోటీల్లో మూడుసార్లు విజేతగా నిలిచారు. ఇదే క్రమంలో నాలుగేళ్ల క్రితం వరకూ రాష్ట్ర స్థాయిలో సైతం సత్తా చాటి మూడుసార్లు చాంపియన్‌షిప్ సాధించారు. అంతర్జాతీయ మహిళ విభాగంలో రెండుసార్లు ప్రతిభ చూపారు. మొత్తంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో 6 పతకాలు సొంతం చేసుకున్నారు. ఒక పక్క జాతీయ స్థాయి మహిళ చెస్ పోటీల్లో చాంపియన్‌గా నిలవడమే లక్ష్యంగా సాధన చేస్తూ, పిల్లల్లో స్ఫూర్తి నింపుతున్నారు.

అబ్రహమ్ ఖాతాలో రాష్ట్ర చాంపియన్‌షిప్

నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న అభిషేక్ అబ్రహమ్ చెస్‌లో అంతుచిక్కని ఎత్తులతో ప్రత్యర్థులకు కొరకరాని కొయ్యిగా మారాడు. నాలుగో ఏట నుంచే చదరంగం సాధన ప్రారంభించాడు. తండ్రి వద్ద శిక్షణ పొందుతూ నగర, మండల, జోనల్, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో రాణిస్తూ ఇప్పటివరకూ 76 బహుమతులు అందుకున్నాడు. ఇదే క్రమంలో అండర్–11 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒకసారి చాంపియన్‌గా నిలవడంతో పాటు మొత్తంగా 9 సార్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాడు. జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సైతం సత్తా చాటి నిర్వాహకుల మన్ననలతో పాటు బహుమతులు అందుకున్నాడు. ప్రపంచ చాంపియన్ కావడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు.

అండర్-9లో జాతీయ పోటీల్లో విజేత అనురూప్

ఐదో తరగతి చదువుతున్న అనురూప్ మోషే క్షణాల్లో ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేయడంతో సిద్ధహస్తుడు. నాలుగో ఏట నుంచే సాధన ప్రారంభించి పతకాల మోత మోగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం అండర్–7 అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రెండో స్థానం సాధించాడు. ఇక అండర్–5, అండర్–9 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో చాంపియన్‌గా అవతరించాడు. అండర్–9 జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు. ఇప్పటివరకు నగర, మండల, జోనల్, డివిజన్, జిల్లా స్థాయిలో 70కు పైగా టోర్నమెంట్లలో పోటీ పడి 62 పతకాలు సొంతం చేసుకున్నాడు.

వృద్ధుడిపై టీడీపీ మూకల దాడి



రమణక్కపేటలో వృద్ధుడు సుబ్బారావుకు భుజం, వీపుపై గాయాలైన దృశ్యాలు

ముసునూరు: రమణక్కపేటలో వైఎస్సార్ సీపీకి చెందిన కుటుంబంపై టీడీపీ మూకలు కర్రలు, కత్తులతో దాడికి పాల్పడడంతో ఓ వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఉప్పే శివనాగాంజనేయులు, శివరామకృష్ణ, సత్యనారాయణ ఉప్పే సుబ్బారావు ఇంటికి వచ్చి మా పార్టీ అధికారంలోకి వచ్చింది ఇక మీరేం చేస్తారంటూ ఉప్పే సుబ్బారావు కుటుంబాన్ని బెదిరించడమే కాక అతని అన్న కొడుకు పెదకాపును, అతని భార్యపైనా దౌర్జన్యం చేయడమే కాక సుబ్బారావుపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో వృద్ధుడు సుబ్బారావు వీపు, భుజంపై, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వెంటనే నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై పి.వాసు మాట్లాడుతూ వీరికి ఇంటి స్థలం విషయంలో పాతకక్షలు ఉన్నాయని, పరస్పరం దాడులకు దిగారని, ఇరువర్గాల వారికి గాయాలయ్యాయని, ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య !

- మెడకు వైరు బిగించి కడతేర్చిన వైనం?
- మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో వెలుగులోకి
- ఖననం చేసిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు



వేములపల్లిలో ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

లింగపాలెం: తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిందంటూ మృతుడి తల్లిదండ్రులు కోడలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఖననం చేసిన మృతదేహాన్ని పోలీసులు గురువారం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి ధర్మాజీగూడెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వేములపల్లి గ్రామంలో చట్టుమాల ఆశీర్వాదం (32) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతనికి భార్య సుమలత, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. భార్య సుమలతకు అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఈ నెల మూడో తేదీ రాత్రి ఆశీర్వాదం నిద్రపోతుండగా సుమలత, ఆమె ప్రియుడు కలిసి అతని మెడకు వైరుతో గట్టిగా బిగించి హత్య చేశారు. అనంతరం మృతి చెందిన ఆశీర్వాదం నోట్లో నిద్ర మాత్రలు వేశారు. అనంతరం భర్త నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అందరిని నమ్మించే ప్రయత్నం చేసింది. అది నిజమేనని నమ్మిన కుటుంబసభ్యులు నాలుగో తేదీన ఆశీర్వాదం మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అయితే ఆశీర్వాదం మృతిపై అతని తల్లిదండ్రులకు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంత్యక్రియల సందర్భంగా తమ కుమారుడి శరీరంపై గాయాలు గమనించామని అప్పట్లో దానిని పెద్దగా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంత్యక్రియల అనంతరం కోడలి సెల్‌ఫోన్‌ను గమనించగా, మెసేజ్‌లు, కాల్ లిస్టు అనుమానాస్పదంగా ఉన్నాయని పోలీసులకు వివరించారు. వారి ఫిర్యాదు మేరకు ధర్మాజీగూడెం ఎస్సై చెన్నారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు తహసీల్దార్, చింతలపూడి సీఐ సుధాకర్, పోలీసులు, రెవెన్యూ, వైద్యులు, స్థానిక పెద్దల సమక్షంలో గ్రామంలో ఖననం చేసిన చోట ఆశీర్వాదం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య సుమలతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన మేనమామను పరామర్శించేందుకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన కోర్సా మురళీమనోహర్ (24) జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన మేనమామను చూసేందుకు ఈనెల 5వ తేదీన మోటార్‌సైకిల్‌పై జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. మండలంలోని జల్లేరు వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మురళీమనోహర్ మృతి ఘటనా స్థలంలోనే చెందాడు. మృతుడి బంధువు కోర్సా వెంకటరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

పాతకక్షలతో మహిళపై దాడి

ముసునూరు: పాతకక్షలను పురస్కరించుకుని మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వాసు గురువారం చెప్పారు. మండలంలోని బలివే గ్రామానికి చెందిన తోట వెంకటలక్ష్మిపై అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దాడి చేశారంటూ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిపై కత్తులతో దాడి.. కేసు నమోదు

ఉండి: భార్యపై అనుమానంతో మరో వ్యక్తిపై హత్యాయత్నం చేసిన భర్త, అతని స్నేహితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన కిన్నెర వెంకన్న భార్య పార్వతి డ్వాక్రా గ్రూపు సభ్యురాలిగా ఉంది. దాని వివరాల కోసం భర్త ఫోన్ నుంచి డ్వాక్రా యానిమేటర్ పామర్తి వరలక్ష్మికి గతంలో ఫోన్ చేసి మాట్లాడింది. అయితే వరలక్ష్మి ఫోన్‌లో కాల్ లిస్టును పరిశీలించిన ఆమె భర్త పామర్తి నాగరాజు.. వెంకన్నకు ఫోన్ చేసి నా భార్య ఫోన్‌లో నీ నంబర్ ఎందుకు ఉందని అతనితో గొడవపడ్డాడు. అప్పటి నుంచి భార్యపై అనుమానం పెంచుకున్న నాగరాజు గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో యానిమేటర్ భర్త నాగరాజు, ఉండి కోండ్రోతు పేటకు చెందిన అతని స్నేహితులు తుమ్మరాడ సాయిరాం, మురాల నాగబాబు అనే వ్యక్తులతో కలిసి వెంకన్న ఇంటికి వచ్చి అతనిని హత్య చేసేందుకు మాటు వేశారు. వీరిలో మురాల నాగబాబు ఇంట్లో ఉన్న వెంకన్నను మాట్లాడే పని ఉందని బయటకు పిలిచి అతనిని గట్టిగా పట్టుకోవడంతో అప్పటికే ప్రహరీ పక్కనే మాటు వేసిన నాగరాజు, సాయిరాం కత్తులతో దాడి చేశారు. ఇది గమనించిన వెంకన్న తనను పట్టుకున్న నాగబాబును గట్టిగా నెట్టి పెద్ద పెద్ద కేకలు వేయడంతో నిందితులు అక్కడ నుంచి మోటార్‌సైకిళ్లపై పారిపోయారు. వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కేవీవీ సత్యనారాయణ, ఎస్సై ఎం.లక్ష్మణ్ ఘటనా స్థలికి వచ్చి వివరాలు సేకరించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల పందేల సొమ్ముతో మధ్యవర్తి పరారీ?

భీమవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోరుగా పందేలు జరగ్గా ఓట్ల లెక్కింపు అనంతరం పట్టణానికి చెందిన ఓ మధ్యవర్తి పరారయ్యాడంటూ ప్రచారం సాగుతోంది. జూదాలకేగాకుండా క్రికెట్, ఎన్నికల పందేలకు అడ్డాగా పేరొందిన భీమవరంలో ఎన్నికల పందేలు దాదాపు రూ.100 కోట్లు పైమాటేననే చెబుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పందేలరాయుళ్లు భీమవరంలో మధ్యవర్తుల ద్వారా రూ.కోట్లలో పందేలు వేయడం పరిపాటి. ఈ పందేలకు మధ్యవర్తిగా వ్యహరించే వ్యక్తికి 5 శాతం కమీషన్ చెల్లిస్తారు. పందేలరాయుళ్లు కాసిన సొమ్మంతా మధ్యవర్తి వద్దే ఉంటుంది. మధ్యవర్తిగా ఎంతో నమ్మకం కలిగిన వ్యక్తిని మాత్రమే ఎంచుకుంటారు. అయితే టుటౌన్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించగా, అతని వద్ద రూ.40 కోట్ల పందేల సొమ్ము ఉండగా, సోమవారం కౌంటింగ్ తరువాత అతను కనిపించకపోవడంతో పందేల్లో గెలిచిన వ్యక్తులు లబోదిబోమంటున్నట్లు చెబుతున్నారు. అయితే పందేల్లో ఓడిన వారి నుంచి సొమ్ములు రాకపోవడం, గెలిచిన వ్యక్తుల ఒత్తిడి కారణంగా మధ్యవర్తి పరారై ఉంటాడని కొంతమంది భావిస్తున్నారు. మొత్తం మీద ఈ ఉదంతంపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందకపోవడం గమనార్హం.

లారీ ఢీకొని సైక్లిస్టు దుర్మరణం

తణుకు: తేతలి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సైక్లిస్టు మృతి చెందాడు. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన నక్కా వెంకటేశ్వరరావు (59) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున సైకిల్‌పై తణుకు వైపు వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వరరావును చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రూరల్ హెడ్‌కానిస్టేబుల్ అత్తిలి శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు గురై యువకుడి మృతి

ముసునూరు: బతుకు దెరువు కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఓ యువకుడు కాట్రేనిపాడులో పాముకాటుకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై పి.వాసు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాట్రేనిపాడులో రెడ్డి శ్రీనుకు చెందిన కోళ్లఫారంలో పనిచేయడానికి మధ్యప్రదేశ్‌లోని డిండోరా జిల్లా సమానపూర్‌కు చెందిన నలుగురు యువకులు సోమవారం వలస వచ్చి పని చేస్తున్నారు. వీరికి నివాసం కోసం యజమాని ఒక షెడ్డును కేటాయించారు. బుధవారం రాత్రి వీరంతా షెడ్డు వసారాలో నిద్రిస్తూ ఉండగా సంజీవ్‌కుమార్ (29) అనే యువకుడి చిటికెన వేలిపై గుర్తు తెలియని పాము కాటు వేసింది. వెంటనే లేచి, మిగిలిన వారికి చెప్పగా, హుటాహుటిన ముసునూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన పోరాపు నాగేశ్వరరావు (33)కు భీమడోలుకు చెందిన రోజాతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో పుట్టింటికి వచ్చిన రోజాను చూసేందుకు నాగేశ్వరరావు ఈనెల 4వ తేదీ మంగళవారం సాయంత్రం రావిపాడు నుంచి భీమడోలుకు వస్తుండగా మార్గమధ్యమైన కురెళ్లగూడెం వద్దకు వచ్చేసరికి తాను నడుపుతున్న బైక్ ముందు టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌పై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం నాగేశ్వరరావు మృతి చెందాడు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశిరెడ్డి రాజీనామా

చాట్రాయి: ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.

పడవెక్కితేనే గమ్యం చేరేది

- తీరప్రాంత గ్రామాల్లో ప్రయాణం కోసం ఇంకా పడవల్లోనే రాకపోకలు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు.. వంతెనలు నిర్మించాలని వేడుకోలు



దొంగపిండి - లక్ష్మీపురం లాకు వద్ద ఉప్పుటేరు డ్రెయిన్‌పై నాటు పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

భీమవరం అర్బన్: తీర ప్రాంత గ్రామాల్లో కష్టాల కడలిలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. అభివృద్ధి పథంలో గ్రామాలు పయనిస్తున్నా ఈ గ్రామాల్లో ప్రజలకు మాత్ర ప్రయాణ కష్టాలు తీరడం లేదు. సముద్రం, ఉప్పుటేరుల వెంబడి ఉన్న పలు గ్రామాలకు ఇంకా పడవ ఎక్కితేనే గానీ గమ్యం చేరే అవకాశం లేదంటే అతియోశక్తి కాదు. ఈ గ్రామాల ప్రజలు ఇప్పటికీ నాటుపడవల్లో ప్రయాణమే శరణ్యంగా మారింది. తీరంలో ప్రధాన డ్రెయిన్లు అయిన బొండాడ, గొంతేరు, ఉప్పుటేరు తదితర డ్రెయిన్ల ప్రాంత గ్రామాల్లో నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కాళ్ల మండలంలోని గోగితిప్ప వద్ద బొండాడ, భీమవరం మండలంలోని దొంగపిండిలో ఉప్పుటేరు వద్ద, కోమటితిప్ప నార్త్‌లో గొంతేరు డ్రెయిన్లపై బ్రిడ్జిలు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు నాటుపడవలపై దాడుతూ డ్రెయిన్లలో ప్రాణాలు పోగొటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అదేవిధంగా దొంగపిండి గ్రామం వద్ద పశ్చిమ, కృష్ణా జిల్లా సరిహద్దు ఉప్పుటేరుపై కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం లాకు వద్ద ప్రతి రోజు వందలాది జనం పడవపైనే ఏరు దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనని వీరంతా భయపడుతున్నారు. గతంలో కోమటితిప్ప, దొంగపిండి, గ్రామాల్లో పడవ దాటుతూ ప్రమాదాలకు గురై అనేక మంది మృత్యువాత సంఘటనలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టకపోవడంతో తీర ప్రాంతవాసుల కష్టాలు తీరడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఈ గ్రామాల్లో నాటుపడవల కష్టాలు తీర్చేందుకు పక్కా వంతెనల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి

గతంలో మా గ్రామంలో బొండాడ డ్రెయిన్‌పై పడవ దాటుతూ ఒకరు ప్రమాదవశాత్తు డ్రెయిన్‌లో పడి చనిపోయారు. నిత్యం కాళ్ల, భీమవరం మండలాలకు సంబంధించి రైతులకు భూములు ఉండటంతో రాత్రులు కూడా పొలాల వద్దకు నాటు పడవలపైనే వెళ్లాల్సి వస్తోంది. పడవల నుంచి వాహనాలు దించేటప్పుడు, ఎక్కించేటప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనలు నిర్మించాలి.

– ఎస్.ధర్మరాజు, రైతు, దొంగపిండి



దొంగపిండి - గోగితిప్ప వద్ద బొండాడ డ్రెయిన్‌పై నాటుపడవపై దాటుతున్న దృశ్యం



పడవలోకి వాహనం ఎక్కిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన ఉండాలి



వైద్య శిబిరం వద్ద లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి అని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాల రావు అన్నారు. లయన్స్‌క్లబ్, కైండ్‌నెస్ సొసైటీ, ఉజ్వల లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణం బ్రహ్మకుమార్శీ కార్యాలయం సమీపంలో విజయవాడ మణిపాల్ ఆస్పత్రి నేత్రత్వంలో దాత పదం కుమార్ గుప్తా సౌజన్యంతో గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, మొబైల్ బస్సులో వివిధ రకాల పరికరాలతో ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, మెమోగ్రాఫ్ టెస్ట్‌లు నిర్వహించారు. 154 మందికి వైద్య పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి రమాదేవి, దాట్ల లక్ష్మీపతిరాజు, జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, మాదిరెడ్డి కృష్ణకుమారి, అవినాష్ రాజు, సత్య స్వరూప్, ఆర్‌వీఎస్ రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహోన్నతుల జీవిత చరిత్రలు నేటి పిల్లలకు ఆదర్శనీయమని విశ్రాంత ఉద్యోగి గిరికపాటి బాపయ్యశర్మ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావుచే నిర్వహించారు. ప్రముఖుల జీవిత విశేషాలను తెలుసుకోవడం, వారి మార్గాలను అనుసరించడం నేటి తరం విద్యార్థులకు ఎంతో అవసరం అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సలహాదారులు ప్రత్తి వీరాస్వామి, రిసోర్స్‌పర్సన్ ఎన్.సత్యంలు విద్యార్థులకు పలు ఆసక్తి కలగించే విషయాలను వెల్లడించారు. లెక్కలలో టిప్స్ చెప్పారు. విద్యార్థినీ విద్యార్థులు హాజరైయారు. యోగా గురువు బి.చంద్రశేఖర్ యోగా నేర్పించారు.

ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌కు సత్కారం



సత్యకుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడ ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌ను బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం తాడేపల్లిగూడెం నుంచి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నాయకులు పసుపులేటి వెంకట రామారావు, నరిశే సోమేశ్వరరావు, సింగం జగపతి రామయ్య, రామగాని సత్యనారాయణలు విజయవాడ వెళ్లి అక్కడ సత్యకుమార్‌ను కలిసి సత్కారం చేశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

కూటమి నేతలకు అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా అశేష అఖండ ప్రజా తీర్పుతో కూటమికి పట్టం కట్టారని, నూతన ప్రభుత్వానికి అంతర్జాతీయ తొలి తెలుగు మహిళా శిల్పి, కళా రత్న దేవికారాణి ఉడయార్ శుభాకాంక్షలు చెప్పారు. నారా చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందరేశ్వరి, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మలకు అభినందనలు తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ వారికి పట్టణానికి చెందిన అనిల్ కుమార్ సాయి, ప్రవల్లిక దంపతులు 8 గ్రాముల బంగారం, అలాగే తెనాలికి చెందిన హేమంత్, కావ్యశ్రీ దంపతులు 10 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీఎన్నార్ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల పాలకవర్గ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) విడుదల చేశారు. వీటిలో బీఏ, బీఎస్సీ, బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్స్), బీబీఏ, బీవోక్ కోర్సులలో విద్యార్థులు నూరు ఉత్తీర్ణత సాధించినట్లు బాబు తెలిపారు. ఈ సందర్భంగా గోకరాజు పాండురంగరాజు మాట్లాడారు. ప్రిన్సిపాల్ జి.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నేటి టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

గడ్డి పరకా బంగారమే !

- వేధిస్తున్న ఎండుగడ్డి కొరత
- ట్రాక్టర్ ఎండు గడ్డి రేటు రూ.10 వేలు



స్ట్రాబేలర్ యంత్రంతో గడ్డిని సేకరిస్తున్న రైతులు



కొనుగోలు చేసిన ఎడ్డుగడ్డిని ట్రాక్టర్‌పై తరలిస్తున్న రైతులు

తణుకు: ప్రకృతి వైపరీత్యాలు.. ఆధునిక యాంత్రీకరణ.. మూగ జీవాల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పాడి పశువుల పోషణకు, అధిక పాల దిగుబడికి మేలైన, మెరుగైన దాణాగా ప్రసిద్ధి గాంచిన ఎండుగడ్డి సామాన్య పాడిరైతులకు అందని ద్రాక్షగా మారింది. వ్యవసాయ విధానం ఆధునీకరణ దిశగా పయనించడంతో పాటు రైతులు తమకు కూలీ ఖర్చులు ఆదా అవుతున్నాయంటూ వరికోత యంత్రాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎండు గడ్డి కొరత సమస్య ఏటా మరింత జటిలంగా మారుతుంది. వరి కోత యంత్రాలను వినియోగించి కోతలు కోయడం వల్ల ఆ గడ్డి నిరుపయోగంగా మారుతోంది. గడచిన మూడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా వేసవిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు రావడంతో కొంత మంది రైతులు సేకరించుకున్న ఎండుగడ్డి తీవ్రంగా దెబ్బతింది. దీనికి తోడు అధిక సంఖ్యలో రైతులు వరి కోత యంత్రాలను ఆశ్రయించడం వల్ల ప్రతి సీజన్‌లో ఎండుగడ్డి కొరత నానాటికీ అధికమవుతోంది. దీంతో స్థానిక పాడి రైతులు ఎకరం గడ్డిని అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. దీనికి మళ్లీ రవాణా, ఎగుమతి, దిగుమతులు, కూలీల ఖర్చుతో కలిపి రూ. 5 వేలు ట్రాక్టర్ గడ్డి ఇంటికి తీసుకువచ్చేసరికి రూ.10 వేల వరకూ అవుతుంది.

ఎండు గడ్డికి భలే డిమాండు

గతంలో ఖరీఫ్ సీజన్‌లో లభించే ఎండుగడ్డిని పాడిరైతులకు పశుగ్రాసంగా ఏడాది పొడవునా వినియోగించేవారు. మారిన పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లోను యంత్రాల సాయంతో కోతలు యంత్రాల తోనే కోయడంతో గడ్డి అంతంత మాత్రంగానే దొరుకుతుంది. దీంతో రబీ సీజన్‌లో కూడా ఎండు గడ్డిని సేకరించి పశువులకు దాణాగా రైతులు వేస్తున్నారు. కూలీలతో కోత కోసేందుకు అవకాశం లేకపోవడంతో యంత్రాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి పాడి రైతుల్లో నెలకొంది. తణుకు నియోజకవర్గంలోని సుమారు 46 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా దాదాపు 40వేల ఎక రాల్లోని పంటను యంత్రాల తోనే కోశారు.

గడ్డి సేకరణ యంత్రాలతో మేలు

ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన గడ్డి కట్టలు కట్టే యంత్రం (స్ట్రాబేలర్) తో కొంత మంది రైతులు గడ్డిని సేకరిస్తున్నారు. ఈ విధంగా సేకరించి గడ్డి మోపు ధర రూ. 35 వరకూ పలుకుతుంది. అంత ధర వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే స్తోమత లేని పేద పాడి రైతులు వరికోత యంత్రాలతో కోసిన పొలాలకు వెళ్లి ఎండుగడ్డిని సేకరిస్తు న్నారు. ఆగడ్డిని పదిలంగా చేసుకుని పశువులకు పెడుతున్నారు. గతంలో అయితే పట్టించుకోని ఆ గడ్డిపరకను నేడు బంగారంలా చూస్తున్నారు. అలాగే పంట పొలాల్లో వదిలేసిన గడ్డిని కొంతమంది కూలీలు సేకరించి పశువుల దాణాకు ఉపయోగించుకుంటున్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి



తణుకులో రాజేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకు: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుల్లో ప్రముఖులు, భూపోరాట యోధులు చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సొసైటీ రోడ్డులోని మున్సిపల్ పార్కు వద్ద రాజేశ్వరరావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పాల్గొని మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థతో దోపిడీ విధానంపై, మహిళల రక్షణకు, పార్టీ రక్షణకు పోరాడిన యోధుడు రాజేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ, సీపీఐ నాయకులు టి.అప్పలస్వామి, బద్దాని నాగరాజు, బొద్దాని కృష్ణ కిశోర్, నూనె రాధాకృష్ణ, సీపీఎం నాయకులు పీవీ ప్రసాద్ పేరూరి మురళీకృష్ణ, న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపి నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ మాట్లాడుతూ బొలిశెట్టి శ్రీనివాసుకు భారీ విజయానికి కృషి చేసిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఎంపీ శ్రీనివాసవర్మ ద్వారా సాధిస్తామన్నారు.

ఎమ్మెల్యే ఆరిమిల్లికి అభినందనలు



రాధాకృష్ణను కలిసి అభినందనలు తెలియజేస్తున్న వివిధ సంఘాలకు చెందిన నాయకులు

తణుకు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తణుకు నియోజకవర్గం నుంచి గెలుపొందిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు అభినందనలు వెల్లువెత్తాయి. తణుకు పట్టణంలోని స్థానిక పాలంగి రోడ్డులో ఉమ్మడి కార్యాలయంలో ఎమ్మెల్యే రాధాకృష్ణను కలిసిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాలకు చెందిన నేతలు, వైద్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు పరిమి వెంకటేశ్వరరావు, డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ బసవా రామకృష్ణ, చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

తణుకు: కొబ్బరి దింపు కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. గురువారం తణుకు సురాజ్య భవన్‌లో తణుకు ఏరియా కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా సంఘాలు నిర్మించుకుని హక్కుల సాధనకు పూనుకోవాలన్నారు. కార్మిక పోరాటాలతోనే హక్కులు సిద్ధిస్తాయన్నారు. కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు సహకరించాలని, వారికి సామాజిక భద్రత కల్పించాలని భీమారావు డిమాండ్ చేశారు. తణుకు ఏరియా కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కోనాల భీమారావు, అధ్యక్షుడిగా బొక్కా సత్యనారాయణ, కార్యదర్శిగా పెచ్చేటి శ్రీను, కోశాధికారిగా కౌరు శ్రీను, కమిటీ సభ్యులుగా కేతా సత్యనారాయణ, దొంగ దానయ్య ఎన్నికయ్యారు.

స్వర్ణాంధ్రలో మూడు కొత్త ఇంజినీరింగ్ కోర్సులు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా మూడు ఇంజినీరింగ్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డా.ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బీబీఏ (బ్యాచ్‌లర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), బీఎంఎస్(బ్యాచ్‌లర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్), బీసీఏ (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) అనే కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఇప్పటికే తమ కళాశాల సుమారు రెండు దశాబ్దాలుగా వేలాది మందిని ఇంజినీర్లుగా తీర్చిదిద్దిందన్నారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రఖ్యాత కంపెనీల్లో పని చేస్తున్నారన్నారు.

కాలువల ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి



భీమవరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగరాజు

భీమవరం: మండలంలోని పంట, మురుగు కాలువల్లో కాలుష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తోట గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి కాలువల ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ తుందుర్రు, వెంపమీదుగా వెళ్లే అడవికోడు, ముత్యంకోడు పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయన్నారు. దీనిపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు రైతుల పంట భూములను రక్షించాలని కోరినట్లు తెలిపారు. ఆక్వా రైతులకు ప్రత్యేక మురుగు పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ కాలువల కాలుష్యంపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రత్యేక ప్రణాళికతో కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు గంగరాజు తెలిపారు.

రైతు సంఘ నాయకుడు వెంకటపతిరాజుకు నివాళి



వెంకటపతిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: రైతు సంఘం నాయకుడిగా, సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడిగా కలిదిండి వెంకటపతిరాజు విశేషమైన సేవలందించారని ఆ పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. గురువారం వెంకటపతిరాజు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణతో ప్రజల కోసం పని చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటపతిరాజు ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే ఆయనకు ఘనమైన నివాళులన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, గొడుగు వెంకటేశ్వరరావు, రత్నకుమారి, గంగరాజు, అన్నం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే వ్యాధుల కట్టడి



తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెం ఆరోగ్య కేంద్రం వద్ద దోమల నివారణపై అవగాహన కార్యక్రమం దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): మలేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నియంత్రణతోనే వ్యాధులను కట్టడి చేయవచ్చని వైద్యులు రూపాదేవి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ఆరోగ్య కేంద్రం వద్ద దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూపాదేవి మాట్లాడుతూ చలి, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారు వెంటనే వైద్యుడిని సంప్రదించి మలేరియా పరీక్షలు చేయించాలన్నారు. ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, ఆరోగ్య పర్యవేక్షకురాలు జి.పద్మలత, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మలేరియా, డెంగీపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డా.శ్రావ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావులు తెలిపారు. గురువారం మలేరియా మాసోత్స వాలను పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అన్ని వార్డులలోని ఆశాలు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యదర్శులతో వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, వై.వి.లక్ష్మణరావులు మాట్లాడుతూ చలి, జ్వరం ఉన్నవారిని ఆరోగ్య సిబ్బంది గుర్తించాలని, వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధి, ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాధిని సమాజం నుంచి తరిమివేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి సూర్యాకాంతం, పర్యవేక్షకులు జి.పద్మలత, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు: విప్పర్రు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెంటపాడు: దోమల వల్ల ప్రబలే మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య సహాయకులు నరేంద్ర పేర్కొన్నారు. గురువారం పడమర విప్పర్రు గ్రామంలో పెంటపాడు వైద్యాధికారులు డాక్టర్ తోట రాజేష్, మౌనికల సూచనల మేరకు మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామాలలో మలేరియా వ్యాధి పట్ల ప్రచారం చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల శభ్రత పాటించాలని, దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్ సత్యనారాయణ, నాగమణి, ఏఎన్ఎం విమల, జ్యోతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉద్యానవర్సిటీ వీసీ

తాడేపల్లిగూడెం: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసును ఉద్యానవర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయనతో పాటు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పీఎస్ఎస్.కిరణ్, పీఆర్ఓ రత్నకిషోర్‌లు ఉన్నారు.

'గూడెం'లో 29.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో గడిచిన 24 గంటల్లో 29.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలో 33.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

12న పాఠశాలలు పునఃప్రారంభం

ఆకివీడు: జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభిస్తామని మండల విద్యాశాఖ అధికారి ఏ.రవీంద్ర గురువారం తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే సుమారు 4,500 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, టైలు, షూలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో తెలిపారు.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం: నరసాపురం గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల పోయిన లైట్లను మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడంలేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలందరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో వీధి దీపాలు సవ్యంగా వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని వాపోతున్నారు. ప్రతి రోజూ ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో షికారుకు వస్తారు. రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంతో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మట్టి వ్యర్థాలతో ఉప్పుటేరు విలవిల



ఉప్పుటేరులోకి వ్యర్థాల మట్టిని వేస్తున్న దృశ్యం

ఆకివీడు: కృష్ణా, పశ్చిమ తీర ప్రాంతాలకు మురుగు నీరు పారేందుకు ప్రధాన ఆధారంగా ఉన్న ఉప్పుటేరు వ్యర్థాలతో విలవిలలాడుతోంది. ఉప్పుటేరులో పూడికలు తొలగించి రెండు దశాబ్దాలు కావస్తోంది. వివిధ ప్రాంతాల్లో ఉప్పుటేరులో పూడికలు పేరుకుపోయి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రైల్వే డబ్లింగ్ లైన్ నిర్మాణంలో రెండో వంతెన నిర్మాణ సమయంలో ఏర్పడిన మట్టి పూడికల తొలగింపు నేటికీ పూర్తి కాలేదు. ఇటీవల జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఉప్పుటేరుపై మరో వంతెన నిర్మిస్తున్నారు. నిర్మాణ సమయంలో అవసరమైన మట్టిని పూడ్చి, పిల్లర్ల కోసం తవ్విన మట్టిని ఉప్పుటేరులోనే వదిలేశారు. దీంతో పూడికలు మరింతగా పెరిగిపోతున్న తరుణంలో గ్రామాల్లోని వ్యర్థాలతో ఏర్పడిన మట్టిని తీసుకొచ్చి ఉప్పుటేరులో భారీగా వేశారు. ఉప్పుటేరు పూడికలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలుచోట్ల వ్యర్థాల్ని ఉప్పుటేరులో వదిలేస్తున్నారు. దీంతో ముంపునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఉప్పు టేరు ఆక్రమణల్ని తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ, ఎల్‌టీ లైన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మాధవరం, ఉప్పరగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణం హౌసింగ్‌బోర్డు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో రిలయన్స్ ఫీడర్ విస్తరణ నిమిత్తం శుక్రవారం ఉద యం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. వన్‌టౌన్‌లోని హౌసింగ్‌బోర్డు, గాంధీబొమ్మ సెంటర్, గణేష్ నగర్, వానపల్లిగూడెం, మామిడితోట, వీకర్స్‌కాలనీ, ఇందిరానగర్, గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియాలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకులో..

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని పలు సబ్‌స్టేషన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బ్యాంకు కాలనీ, సూర్యాలయం వీధి, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సజ్జాపురం, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఇరగవరం కాలనీ, రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్, అక్షయ నగర్, శివ బాలాజీ నగర్, లక్ష్మిగణేష్ నగర్, మున్సిపల్ కార్యాలయం, కొమ్మాయి చెరువు గట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.